# రేవంత్ రైతులకు క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

- ఆ తర్వాతే హుజూరాబాద్ గడ్డపై అడుగు పెట్టాలి
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ డిమాండ్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 22: వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలు అని యావత్తు తెలంగాణ రైతాంగాన్ని అపహాస్యం చేసిన టీపీసీసీ నేత రేవంత్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడిగేందుకు వస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్ ప్రశ్నించారు. రైతులందరికీ క్షమాపణలు చెప్పాకే హుజూరాబాద్ గడ్డపై అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం హుజూరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలతో అధికారంలోకి రావాలని చూస్తున్నదని, అది వాళ్ల భ్రమ మాత్రమే అవుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిని ఈ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అపహాస్యం చేస్తూ కాంగ్రెస్ నేతలు మాట్లాడడం సరి కాదన్నారు. కాంగ్రెస్ మూడు గంటల కరెంటు కావాలా..? మూడు పంటలకు 24 గంటల ఉచిత కరెంటు, నీళ్లు ఇచ్చే బీఆర్ఎస్ కావాలా? రైతులు ఆలోచన చేయాలన్నారు. ఆలోచించి కాంగ్రెస్‌కు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌తో పాటు హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వర్థినేని రవీందర్‌రావు, మండల అధ్యక్షుడు డాక్టర్ సంగెం ఐలయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మొలుగూరి ప్రభాకర్, బీఆర్ఎస్ సోషల్ మీడియా నియోజకవర్గం కన్వీనర్ తులసి లక్ష్మణమూర్తి, సీనియర్ నాయకులు పంజాల సదానందంగౌడ్, ఎండీ ఇమ్రాన్, శివారెడ్డి, కొలిపాక సమ్మయ్య, ఏ కుమారస్వామి, వడ్లకొండ కిరణ్‌కుమార్‌గౌడ్, బత్తిని సంపత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# ఫేక్ ఆడియో క్రియేట్ చేసిన వారిని వదిలిపెట్టం



మానకొండూర్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు దరువు ఎల్లన్న

- పోలీసుల విచారణలో నిజాలు తెలుస్తాయి
- రసమయి గెలుపును జీర్ణించుకోలేకనే కొంతమంది కుట్రలు
- బీఆర్ఎస్ నాయకుడు దరువు ఎల్లన్న

మానకొండూర్, నవంబర్ 22: ఇటీవల ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో తాను మాట్లాడినట్లు 'ఫేక్ అండ్ ఫ్యాబ్రికేటెడ్' ఆడియోను క్రియేట్ చేసి సోషల్‌మీడియాలో వైరల్ చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ నాయకుడు దరువు ఎల్లన్న హెచ్చరించారు. బుధవారం మానకొండూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తిమ్మాపూర్‌లో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగసభ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి గెలుపు ఖాయమని ప్రజలు మాట్లాడుకోవడం చూసి కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని మండిపడ్డారు. కొంతమంది కావాలనే ఎమ్మెల్యే రసమయి, తాను మాట్లాడినట్లు ఆడియోను క్రియేట్ చేశారని వెల్లడించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆడియో ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు క్రియేట్ చేశారు ? ఎందుకు లీక్ చేశారో అనే విషయాలు పోలీసుల విచారణలో తెలుస్తాయని చెప్పారు. ఫోన్ రికార్డు చేసి, బ్లాక్‌మెయిల్ దందాలు చేసే వ్యక్తిత్వం తనది కాదన్నారు. తాను రసమయన్నతో ఫోన్‌లో మాట్లాడక దాదాపు 15 ఏళ్లు అవుతున్నదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రాకముందే ఇలాంటి కుట్రలు చేస్తున్నారని, ఒక వేళ అధికారంలోకి వస్తే ప్రజలను నిండా ముంచుతారని తెలిపారు. కావాలని కుట్రలు పన్ని ఫేక్ ఆడియోను క్రియేట్‌చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో ప్రజలందరినీ శ్రీరామరక్షగా కాపాడేది బీఆర్ఎస్ అని విశ్వసించే తాను ఈ పార్టీలో చేరానని తెలిపారు. రామన్న పిలుపు మేరకు పార్టీలో చేరిన తాను రసమయన్న గెలుపు కోసం నిరంతరం కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పారునంది కిషన్, పురం అనిల్, మల్లగల్ల నగేశ్, కొండ్ర నిర్మల, ఆరెపల్లి కిరణ్, పుల్లూరి శ్రీనివాస్, రామంచ ప్రవీణ్, కనకం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో ఓటరు కార్డుల పంపిణీ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఈవో పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 22: జిల్లాలో ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికల ఏర్పాట్లపై బుధవారం ఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితీశ్ వ్యాస్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ కలిసి జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని 10,59,215 మంది ఓటర్లలో ఇప్పటివరకు 7,37,773 మందికి ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన వారికి నిర్దేశించిన గడువులోగా అందజేయనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాకు వచ్చిన 1,11,931 ఓటరు గుర్తింపు కార్డుల్లో 1,09,509 కార్డులు ఇప్పటికే పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఆబ్సెంటీ ఓటర్ల కోసం 1195 పోస్టల్ బ్యాలెట్లు, హోమ్ ఓటింగ్ కోసం 31 బృందాలు, 1338 పోలింగ్ కేంద్రాలకు 1477 పోలింగ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ కూడా పూర్తి చేసినట్లు వివరించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ కూడా అందజేసి, పకడ్బందీగా పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే, లెక్కింపు ప్రక్రియ కూడా అత్యంత జాగ్రత్తగా చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై జిల్లాలో ఇప్పటివరకు 18 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. వాటిలో 6 పరిష్కరించామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పవన్‌కుమార్, కరీంనగర్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మహేశ్వర్, ఇతర అధికారులు నవీన్‌కుమార్, శ్రీనివాసరావు, వీర బుచ్చయ్య, శ్రీలత, కొమురయ్య, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



పూలు చల్లుతూ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

# పదేళ్లుగా ప్రజల కోసమే పని చేశా

- మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి
- కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఆగం కావద్దు
- జంగపల్లిలో కులసంఘాలను కలిసిన ఎమ్మెల్యే రసమయి

గన్నేరువరం, నవంబర్ 22: ఎమ్మెల్యేగా పదేళ్లుగా నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే పని చేశానని, మరోసారి తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోరారు. మండలంలోని జంగపల్లిలో బుధవారం అన్ని కుల సంఘాలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు వచ్చినప్పుడే కాంగ్రెస్ నాయకులకు ప్రజలు గుర్తుకొస్తారని విమర్శించారు. 50 ఏళ్లు పాలించిన ఆ పార్టీ ప్రజలకు చేసింది ఏమీ లేదని, ఇప్పుడు మళ్లీ ఒక అవకాశం ఇవ్వాలని అడగడం సిగ్గుచేటు అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు ఆగం కావొద్దని సూచించారు. గ్రామానికి కాల్వలు తవ్వించి కాళేశ్వరం నీటిని అందించమన్నారు. అన్ని విధాలా అభివృద్ధి చేశానని, మరోసారి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాగా, ఆయా కుల సంఘాల సభ్యులు, నాయకులు రసమయికి మద్దతు ప్రకటించారు. మళ్లీ భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రవీందర్ రెడ్డి, సర్పంచ్ శారద శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, మహేందర్ రెడ్డి, సుధాకర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు మెచ్చే బీఆర్ఎస్‌లోకి



సుంకె రవిశంకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న రుద్రారం, రంగసాయిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి,(రామడుగు) నవంబర్ 22: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ పథకాలు మెచ్చే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. రామడుగు మండలంలోని రుద్రారం, రంగసాయిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సమారు 200 మంది ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉన్నారని తెలిపారు. కాగా, ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ గెలుపునకు తమ వంతు కృషిచేస్తామని నూతనంగా పార్టీలో చేరిన వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు, సింగిల్‌విండో చైర్మన్ ఒంటెల మరళీకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ దాసరి రాజేందర్‌రెడ్డి, ఎడవెల్లి పాపిరెడ్డి, నాయకులు కల్గేటి లక్ష్మణ్, నేరెళ్ల ఆంజనేయులు, గుండి ప్రవీణ్, పూడూరి మల్లేశం, లంక లక్ష్మణ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## లైంగికదాడి కేసులో 20 ఏళ్ల జైలు

కోర్టుచౌరస్తా, నవంబర్ 22: ఓ బాలిక(12)పై లైంగికదాడి కేసులో నిందితుడైన పీచు శేఖర్ అలియాస్ శేఖర్‌రెడ్డి అలియాస్ రమేశ్‌కు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా సెషన్స్, పోక్సో కోర్టు జడ్జి శ్రీవాణి బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలంలోని ఓ గ్రామంలో కూలి పని చేసుకుంటున్న భార్యాభర్తలకు ఐదుగురు సంతానం కాగా, వీరిలో ముగ్గురు అమ్మాయిలు ఇద్దరు అబ్బాయిలున్నారు. ఇందులో చిన్నకూతురు ఇంట్లోనే ఉంటున్నది. అదే గ్రామానికి చెందిన నేరచరిత్ర కలిగిన పీచు శేఖర్‌రెడ్డి అలియాస్ రమేశ్‌కు ఈ కుటుంబంతో పరిచయం ఉంది. కాగా, ఈ ఏడాది ఫిబ్రవరి 6న బాలిక తల్లిదండ్రులు పనిపై వెళ్లగా, మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఆమె ఒంటరిగా ఉండడాన్ని గమనించిన శేఖర్‌రెడ్డి బాలికను మాటల్లో పెట్టి లైంగికదాడికి ఒడిగట్టాడు. అదే సమయంలో బాలిక తల్లిదండ్రులు పని ముగించుకొని ఇంటికి రాగా, ఇంటి తలుపులు లోపటి నుంచి గడియ వేసి ఉండడంతో అనుమానం వచ్చి మరో ద్వారం గుండా ఇంట్లోకి వెళ్లారు. వీరిని గమనించిన శేఖర్‌రెడ్డి పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు శేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. సీఐలు శశిధర్‌రెడ్డి, రమేశ్ దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజమూరి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి శ్రీవాణి నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.